నమస్తే తెలంగాణ
నిజామాబాద్, శుక్రవారం 19 ఏప్రిల్ 2024
FRIDAY, APRIL 19, 2024

బాల్యవివాహాలను అడ్డుకున్న అధికారులు

ధర్పల్లి/ వేల్పూర్, ఏప్రిల్ 18 : రెండు చోట్ల మైనర్లకు బాల్యవివాహాలు చేస్తున్నారని సమాచారం అందుకున్న అధికారులు పోలీసులతో కలిసి వివాహాలను అడ్డుకున్నారు. ధర్పల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలకేంద్రానికి చెందిన 15 ఏండ్ల మైనర్ బాలికతో 21 సంవత్సరాల అబ్బాయితో వివాహం జరుగుతుందన్న సమాచారం అందడంతో సీడీపీవో స్వర్ణలతతో కలిసి వివాహాన్ని అడ్డుకున్నారు. ఇరుకుటుంబాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్యవివాహాలు చేస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చైల్డ్ లైన్ అధికారి జ్యోత్స్న, పోలీసు సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్‌లో బాల్యవివాహం చేస్తున్నారన్న సమాచారం రావడంతో అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన 15 ఏండ్ల బాలికకు వివాహం చేస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామానికి చెందిన బాలికకు ఆర్మూర్ మండలంలోని గోవిందపేట్‌కు చెందిన రాకేశ్ (25 ఏండ్లు)కు ఇచ్చి ఆదివారం వివాహం చేయాలని పెద్దలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న అధికారులు వేల్పూర్ పోలీసుల సహాయంతో బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్యవివాహం చేస్తే జరిగే అనర్థాలను వివరించారు. బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపర్చారు. ఐసీపీఎస్ కౌన్సిలర్ జమ్రూ, సూపర్‌వైజర్ గంగహంస, చైల్డ్‌లైన్ 1098 సూపర్‌వైజర్ బాబు, పంచాయతీ కార్యదర్శి, జూనియర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధర్పల్లిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసు సిబ్బంది

నేడు మెగా వైద్య శిబిరం

కోటగిరి, ఏప్రిల్ 18 : మండలకేంద్రంలోని చావిడి వద్ద గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ మాజీ అధ్యక్షుడు తేళ్ల రవికుమార్, అధ్యక్ష, కార్యదర్శులు హన్మంతరావు, కప్ప సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల శిబిరం కొనసాగనుందని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తహసీల్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు

బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ శాంత

చందూర్, ఏప్రిల్ 18 : మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఓటరు కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ శాంత మాట్లాడుతూ.. ఓటు హక్కు ఆయుధం లాంటిదని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఉప తహసీల్దార్ ఆసియా ఫాతిమా, ఏపీఎం పద్మ, డ్వాక్రా మహిళలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎడ్ సెమిస్టర్ రెగ్యులర్ ప్రారంభం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18 : టీయూ పరిధిలో బీఎడ్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షకు 1,311 మంది విద్యార్థులకు 1,254 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల–నిజామాబాద్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల– కామారెడ్డి, ఎన్ఆర్‌యన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల –బాన్సువాడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఆర్మూర్, బోధన్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ మానస

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్18: మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వరి కల్లాల్లో పని చేస్తున్న రైతులకు గురువారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను డాక్టర్ మానస అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలో పనిచేసేవారు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తాగునీటిని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి

కార్యకర్తలతో మాట్లాడుతున్న పోచారం భాస్కర్‌రెడ్డి

వర్ని, ఏప్రిల్ 18 : కార్యకర్తలకు అండగా ఉంటానని డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. మండలంలోని హుమ్నాపూర్‌లో గురువారం ఆయన పర్యటించారు. బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమై చర్చించారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాయితి నారాయణ అనారోగ్యానికి గురికావడంతో ఆయనను పరామర్శించారు. శ్యాంసుందర్ రెడ్డి, పిట్ల సాయికుమార్ ఇండ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వర్ని మండల కో–ఆప్షన్ సభ్యుడు కరీం, మాజీ సర్పంచులు రాజు, నానిబాబు తదితరులు ఉన్నారు.

సర్పల్లి తండాలోనే జీపీ భవనాన్ని నిర్మించాలని ధర్నా

గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

సిరికొండ, ఏప్రిల్ 18 : మండలంలోని సర్పల్లితండాకు గ్రామపంచాయతీ భవనం మంజూరైంది. జీపీ భవన నిర్మాణ పనులను ఒడ్డెర కాలనీలో ప్రారంభించారు. దీంతో సర్పల్లి తండావాసులు సర్పల్లి తండాలోనే భవనాన్ని నిర్మించాలని కోరుతూ గురువారం రాస్తారోకో చేపట్టారు. సర్పల్లి తండా నుంచి ఒడ్డెర కాలనీ సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. ఒడ్డెర కాలనీలో భవనాన్ని నిర్మించవద్దని గతంలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ, బుధవారం రాత్రి భవనానికి పునాదులు తీశారని తెలిపారు. పెద్దవాల్గోట్ వాసులు కావాలనే ఒడ్డెర కాలనీలో భవనాన్ని నిర్మించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ధర్నా విరమింపజేశారు.

తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి

కోటగిరి, ఏప్రిల్ 18 : ఎండలు తీవ్రంగా ఉన్నాయని, గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పైప్‌లైన్ లీకేజీలు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో మారుతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్ర

రుద్రూర్, ఏప్రిల్ 18 : మండలంలోని చిక్కడ్‌పల్లి నుంచి హనుమాన్ మాలధారులు గురువారం కొండగట్టుకు పాదయాత్రగా తరలివెళ్లారు. గ్రామస్తులు మంగళహారతులతో, భక్తిపాటలు పాడుతూ వారిని సాగనంపారు. 23న హనుమాన్ జయంతి వరకు కొండగట్టుకు చేరుకోనున్నట్లు మాలధారులు తెలిపారు.

విద్యార్థులకు అభినందన

సిరికొండ, ఏప్రిల్ 18 : అబాకస్, వేదిక్ మ్యాథ్స్ విభాగాల్లో ప్రతిభ చూపిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను విద్యుత్‌శాఖ సిరికొండ ఏఈ దాసరిచంద్రశేఖర్.. ప్రిన్సిపాల్ నర్సయ్యతో కలిసి గురువారం అభినందించారు. సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. గణితమంటే భయాన్ని తొలగించడంతోపాటు తక్కువ సమయంలో గణిత సమస్యలను పరిష్కరించేందుకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ దోహదపడుతుందని అన్నారు.

అబద్ధాల కోరు.. అర్వింద్‌ను చిత్తుగా ఓడించాలి

-రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు

మాట్లాడుతున్న రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 18: గత ఎన్నికల్లో పసుపు బోర్డు తెస్తానని మోసం చేసిన అబద్ధాల అర్వింద్‌ను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం వారు పట్టణంలోని కుమార్‌నారాయణ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్లు మంథని గంగారాం, సుర్బిర్యాల్ లింగా రెడ్డి, దేవారాం మాట్లాడారు. గత ఎంపీ ఎన్నికల్లో ధర్మపురి అర్వింద్ గెలిచిన ఐదు రోజుల్లోపసుపు బోర్డు తెస్తానని లేని పక్షంలో రాజీనామా చేసి రైతులతో కలిసి ఉద్యమాల్లో పాల్గొంటానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఐదేండ్లయినా పసుపుబోర్డు తెచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇప్పుడు మళ్లీ అబద్ధాలు చెప్పి ప్రజలు, రైతులను మోసం చేయడానికి వస్తున్నాడని, ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు గంగారాం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

వస్తువులను అందజేస్తున్న కెనరా బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 18 : నగరంలోని ఆర్యనగర్ బ్యాంకు కాలనీలో ఉన్న గ్రేసీ సొసైటీ చెవిటి, మూగపిల్లల పాఠశాలకు కెనరా బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ – తెలంగాణ స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను గురువారం అందజేశారు. ఏక్‌నాథ్‌పాయ్ 84వ జయంతిని పురస్కరించుకొని రూ. 25 వేల విలువ చేసే వస్తువులను అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, రత్నాకర్, శ్రీనివాస్, మధుకుమార్, ప్రశాంత్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న బైక్

- భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

ఇందల్వాయి, ఏప్రిల్ 18 : జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లాకు చెందిన ఒకరు మృతిచెందగా..భార్యకు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా దవాఖానకు తరలించారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహమీర్ తండాకు చెందిన జాదవ్ సుధాకర్, భార్య శిరీషతో కలిసి బైక్‌పై గురువారం కామారెడ్డిలోని బంధువుల ఇంటికి బయల్దేరారు. జక్రాన్‌పల్లి బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టింది. దీంతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందగా.. గాయపడిన భార్య శిరీషను 108 అంబులెన్సులో జిల్లా దవాఖానకు తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు నిజామాబాద్‌కు తరలిరావాలి

వేల్పూర్, ఏప్రిల్ 18: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం జిల్లా కేంద్రంలో నామినేషన్ సందర్భంగా నిర్వహించే ర్యాలీకి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగధర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

మోర్తాడ్, ఏప్రిల్ 18: ఎండలు ఎక్కువగా ఉన్నందున నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తిరుమల సూచించారు. గురువారం మండల కేంద్రంలో నర్సరీని ఆమె పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎండలు విపరీతంగా ఉన్నందున మొక్కలకు ప్రతిరోజూ నీటిని అందించాలని అన్నారు. నర్సరీల్లో పెరిగిన కలుపు మొక్కలు తొలగించాలని చెప్పారు. ఆమె వెంట ఎంపీవో శ్రీధర్, కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు ప్రారంభం

కందకుర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రెంజల్, ఏప్రిల్ 18: మండలంలోని కందకుర్తి శివారులో తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులో అంతర్రాష్ట్ర చెక్ పోస్టును గురువారం ప్రారంభించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. జాతీయ ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రకటించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కందకుర్తి సరిహద్దులో చెక్ పోస్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్, ఎక్సైజ్, సాంఘిక సంక్షేమ, వ్యవసాయ శాఖల సమన్వయంతో నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర వైపు నుంచి మద్యం, డబ్బులు, నిషేధిత మత్తు పదార్థాలు తెలంగాణలోకి ప్రవేశించకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలకు వెంకటేశ్వరరెడ్డి శరీరదానం

- అంతకుముందు నేత్రదానం

భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి, లయన్స్ క్లబ్ భవానీ ప్రతినిధులు

బోధన్, ఏప్రిల్ 18: తన మరణానంతరం తన శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం బోధన్ పట్టణం రాకాసిపేట్‌కు చెందిన బొడ్డు వెంకటేశ్వర రెడ్డి దానం చేసి చిరంజీవిగా నిలిచిపోయారు. 94 ఏండ్ల వయస్సున్న వెంకటేశ్వరరెడ్డి బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయన భౌతికకాయాన్ని ఆయన కుమార్తె విజయ, మనవడు రవీందర్‌రెడ్డి గురువారం నిజామాబాద్ మెడికల్ కళాశాలకు దానం చేశారు. ఆయన భౌతికకాయాన్ని నిజామాబాద్ మెడికల్ కళాశాలకు తీసుకెళ్లి అప్పగించారు. రాష్ట్ర శరీర, అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో ఈ శరీరదానం చేశారు. అంతకుముందు ఆయన నేత్రాలను లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ఆధ్వర్యంలో దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించారు. అంతకుముందు వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయం వద్ద రాష్ట్ర శరీరదాతల సంఘం అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.బాలగంగాధర్‌రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ అధ్యక్షుడు ఎం.సాయిబాబాగౌడ్, కార్యదర్శి పల్లెంపాటి శ్రీధర్, కోశాధికారి పావులూరి వెంకటేశ్వరరావుతోపాటు బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతీ శరత్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

బోధన్ ఆచన్‌పల్లిలో మహిళ నేత్రదానం

అచ్చమ్మ(ఫైల్)

బోధన్, ఏప్రిల్ 18: పట్టణంలోని ఆచన్‌పల్లి నివాసి మెట్టు హనిమిరెడ్డి సతీమణి మెట్టు నాగ అచ్చమ్మ(64) గురువారం తెల్లవారుజామున 4 గంటలకు కన్నుమూయగా, ఆమె నేత్రాలను దానంచేశారు. ఆమె మరణానంతరం నేత్రాలను దానం చేయనున్నట్లు సమాచారాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి సభ్యులకు అందించారు. ఈ మేరకు ఆమె రెండు నేత్రాలను బోధన్‌లోని లయన్స్ కంటి దవాఖాన సిబ్బంది సేకరించి, వాటిని హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించారు. తన మరణానంతరం ఇద్దరికి చూపును ప్రసాదించిన నాగ అచ్చమ్మకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు, సభ్యులు నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

నందిపేట్/ఇందల్వాయి, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా డొంకేశ్వర్ మండలంలోని జీజీ నడ్కుడ గ్రామంలోని ఇండేన్ ఎల్పీజీ గోదాంలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారులు సుధాకర్, రాములు, మధు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

డిచ్‌పల్లి, ఇందల్వాయి మండల కేంద్రాల్లోని పలు హోటళ్లలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు యజమానులకు వివరించారు. ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నరేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీజీ నడ్కుడలోని ఎల్పీజీ గోదాంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

భీమ్‌గల్, ఏప్రిల్ 18: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ కృష్ణమూర్తికి సీఐటీయూ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌బాబు మాట్లాడుతూ కార్మికులకు రెండేండ్లకు పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయకపోవడంతో వారు నష్టపోతున్నారని అన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వెయ్యి రూపాయల వేతనం కూడా చెల్లించడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు ఆదివారం సెలవు అమలు చేయడం లేదని అన్నారు. కార్మికులకు చీపుర్లు, పారలు, గ్లౌజులు, చెప్పులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. నెల రోజుల్లోగా సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు గంగవ్వ, బాబాయ్, సాయిలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 18 : జిల్లా కేంద్రంలోని హనుమాన్ జంక్షన్‌లోని విగ్రహాల పార్కులో సావిత్రీబాయి పూలే విగ్ర నిర్మాణ పనులను బీసీ సంక్షేమ సంఘం నాయకుడు గురువారం ప్రారంభించారు. మహాత్మా జోతిబా పూలే విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే విగ్రహం ఉండాలన్న ఉద్దేశంతో బీసీ సంక్షేమ సంఘం, బీసీ ఉపాధ్యాయ సంఘం, ఉద్యోగ, యువజన, మహిళా విభాగాల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, మాడవేడి వినోద్‌కుమార్, కొయ్యాడ శంకర్, శ్రీలత, లక్ష్మణ్‌గౌడ్, చంద్రమోహన్, గోపాలకృష్ణ, కోడూరు స్వామి, బాలన్న, రవి, మోహన్, రాజు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితుడికి ఆర్థిక సాయం

నందిపేట్, ఏప్రిల్ 18: మండల కేంద్రానికి చెందిన జాదవ్ రాజు కిడ్నీలు చెడిపోయి కొన్ని రోజులుగా డయాలసిస్ చికిత్స పొందుతున్నాడు. ఆయనకు తల్లి, భార్య, కూతురు ఉన్నారు. నిరుపేద అయిన రాజుకు గౌడ సంఘం అధ్యక్షులు సుధాకర్ గౌడ్, మాదస్తు శేఖర్, నాగూర్‌వల్లి తదితరులు ఆర్థిక సాయం అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఖాందేశ్ శ్రీనివాస్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్18: రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా ఖాందేశ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వ్యవస్థాపకులు ఖాందేశ్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సంతాపం

రెంజల్, ఏప్రిల్ 18: మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన నబాజ్‌బేగ్ అనే విద్యార్థి బుధవారం మధ్యాహ్నం గోదావరిలో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. నబాజ్‌బేగ్ నీలా జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి గత నెలలో పరీక్షలు రాశాడు. విద్యార్థికి సంతాపంగా గురువారం నీలా జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఇల్తేపు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

మౌనం పాటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బైకులు చోరీ చేసిన నిందితుడి అరెస్టు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 18 : నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి ద్విచక్రవాహనాలు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వర్నిరోడ్డు ఏరియా ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన యువకుడు మాధవ్ సుధామ్ టోంకే ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన సదరు యువకుడు జిల్లా ప్రభుత్వ దవాఖాన, ఖలీల్‌వాడి నుంచి మూడు బైక్‌లను ఇటీవల చోరీ చేశాడు. గాంధీచౌక్ వద్ద పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతడిని పట్టుకొని విచారించారు. తాను చేసిన చోరీలను అంగీకరించినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకున్న ఏఎస్సై షకీల్ తో పాటు క్రైమ్ పార్టీ సిబ్బందిని ఎస్‌హెచ్‌వో అభినందించారు.

సంక్షిప్తంగా..

- **ఉపాధి హామీ పనుల పరిశీలన** - డిచ్‌పల్లి, ఏప్రిల్ 18 : మండలంలోని నడ్పల్లిలో ఉపాధి హామీ పనులను డీఆర్డీవో సాయన్న గురువారం పరిశీలించారు. ఉపాధి కూలీలందరికీ నీడ వసతి, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు.
- **నర్సరీలు** - కోటగిరి, ఏప్రిల్ 18 : పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం, జల్లాపల్లి ఆబాదిలోని నర్సరీలను కోటగిరి ఎంపీడీవో మనోహర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వెంట పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వరి, శ్రీవాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.
- **మైలారంలో గ్రామసభ**- ధర్పల్లి, ఏప్రిల్ 18 : మండలంలోని మైలారంలో గ్రామసభను ప్రత్యేకాధికారి రాంప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. గ్రామంలో తాగునీటి, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని తీర్మానం చేశారు. సమావేశంలో కార్యదర్శి గాయత్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **ఎమ్మెల్యేకు రథోత్సవ ఆహ్వానం** - ఇందల్వాయి, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో ఈనెల 23న నిర్వహించే రథోత్సవానికి రావాలని కోరుతూ వీడీసీ సభ్యులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం గ్రామ సమస్యలను విన్నవించారు.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank
(భారత ప్రభుత్వరంగ సంస్థ)
సిండికేట్ Syndicate
జనరల్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్, సర్కిల్ ఆఫీస్, హైదరాబాద్, MCH నం. 10-3-163, 10-3-163/A, ప్లాట్ నం.85, రైల్ నిలయం ప్రక్కన, ఎస్‌డి రోడ్డు, సికింద్రాబాద్–500028.
ఫోన్: 040-27725221/23/24/25/26
ఆవరణ కావలెను
దిగువ తెలిపిన లొకేషన్ వద్ద బ్రాంచ్/ఆఫీస్ కొరకు అవసరమైన పవర్ లోడ్‌తో ఆక్రమించుకొనుటకు సిద్ధంగా ఉన్న మరియు ముఖ్యంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కమర్షియల్ స్థలం కలిగిన యజమానుల నుండి సింగిల్–బిడ్ క్రింద ఆఫర్లు కోరబడుచున్నవి.

లొకేషన్, ప్రదేశం	జిల్లా	కార్పెట్ ఏరియా	బిడ్డింగ్ విధానం
ఎర్గట్ల	నిజామాబాద్	1500 చ.అ. వరకు	సింగిల్

వివరాలు బ్యాంక్ వెబ్‌సైట్: http://www.canarabank.comలో ప్రచురించబడినవి. అవసరమైన దరఖాస్తు ఫారాలు పైన తెలిపిన ఆఫీస్ నుండి పొందవచ్చు లేదా బ్యాంక్ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దాఖలు చేయుటకు ఆఖరి తేది 03-05-2024న మధ్యాహ్నం 3.00 గంటల వరకు. తదుపరి సమాచారం, సవరణ, అనుబంధాలు ఏవైనా ఉన్నచో, అవి బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి.
ప్రదేశం: హైదరాబాద్
తేది: 18-04-2024
సం/– అసిస్టెంట్ జనరల్ మేనేజర్
హైదరాబాద్ సర్కిల్